రత్తమ్మ—తండ్రిగండాన పుట్టి, మొగుడన్న పేరిగాణ్ని కూడా మింగేసింది. అదేంపిల్లరా దరిద్రగొట్టు పిల్లా? దానిమీద ఆశ వొదులుకోమ్మా! దానిచూపు పడ్డ చోటు—మన కొద్దది. మనస్సు తిప్పేసుకో. అది చచ్చినా వొకటే, బతికినా వొకటే. వూరుకోమ్మా!

రాయడు—పేరిగాడు పోతే పొంగిపోయాను. మొదటికే వచ్చింది మోసం!

రత్తమ్మ—వాడికి తగ్గ దదీ, దానికి తగ్గవాడు వాడూనూ. ఎన్నిమాట్లో వాడి వొళ్లోకూచుం దది. ఎన్నిమాట్లో దాన్నెత్తుకొని వాడు ముద్దులాడాడుట. ఛీ ఛీ! అదెందుకూ మనకీ? మనం యిక్కడ చిక్కడి పోయాంకనక యిదేదో అయిపోయిందాకా తప్పదు. తరవాత క్షణం వుండం యిక్కడ.

రాయడు—బతక దంటావా? ఇక ఆశ లేదూ?

రత్తమ్మ—బతకదురా. "బావోయ్! బావోయ్!" అన్న పేలాపనకి విధీ విరామం లేదు. చూపు చెడింది. మనధోరణి యేమీ లేదు. లేకపోతే నిజానికి చేసుకో తగ్గ పిల్లే. సందేహం లేదు. బోలెడు ఆస్తి—

రాయడు—కొత్తవైద్యుణ్ణి తీసుకు వచ్చారుట కాదూ?

రత్తమ్మ—అవును. గట్టివాడేట. రెండువంద లిస్తే నాది పూచీ అంటూ బిరుదుకట్టుకొని వచ్చాడుట. సత్యనారాయణమూర్తీ, వెంకన్నబాబూ తిన్నగా చూస్తే—పైకి ఏమీ అనవద్దు. చూస్తూవుందాం. బతు కుతుందా పైకి పోనియ్యను. లేదూ,......ఏం?

రాయడు—పద.

(ఇద్దరూ వెళ్లిపోతారు.)

(తెరదించాలి.)

## ఎనిమిదో రంగం

[కాంతమ్మయిల్లు. దక్షిణపువేపు వసారాలో బంగారమ్మ మంచంమీద పడుకొనివుంటుంది. కాంతమ్మ బంగారమ్మమీద చెయ్యివేసుకొని మంచందగ్గిర కింద కూచునివుంటుంది. రత్తమ్మా, మరిముగ్గురు స్త్రీలూ తల్లింపుదిక్కున వుంటారు. భద్రయ్యా, ప్రకాశమూ కాళ్లకాడ దిక్కున వుంటారు. రాయడూ, మరోనలు గురు పురుషులూ గదిలో వుంటారు. వైద్యుడు సాన మీద తేనెతో వొక ఔషధం అరగదీస్తూవుంటాడు.]

కాంతమ్మ—అన్నయ్యగారూ!

ప్రకాశం—ఏం అక్కయ్యగారూ?

కాంతమ్మ—మందు మీరు నాకించండి.

ప్రకాశం—అలాగేనమ్మా!

వైద్యుడు—అయింది, రండి.

(ప్రకాశం సానమీది మందు అనామికతో తీసి మంచందగ్గిరికి వెళ్లి బంగారమ్మకి నాకించపోతాడు.)

బంగారమ్మ—(తూతూ అని మందు ఉమ్మి వేస్తూ) నేనూ వస్తున్నా నుండు బావోయి!

కాంతమ్మ—ఇంకెక్కడి బావ మాతల్లీ?

ప్రకాశం—ఔషధం కాస్తేనా లోపలికి వెళ్లి లేదు, ఏమిటి చెయ్యడం?

వైద్యుడు—ఎలాగో వెళ్లేటట్టు చెయ్యాలి. కం ఠం దిగిందా, యిక పరవా లేదు. మళ్లీ అరగదీస్తాను. ఏం చెయ్యను మరీ.

రత్తమ్మ—బంగారం తెలిసే మందు మింగడం లేదంటారా ప్రకాశంగారూ?

ప్రకాశం—కోడలు మనలో లేందే. వున్నంత సేపూ మింగలేదూ? పోనీ, మళ్లీ యింజెక్షను చేయిద్దా మంటే—

వైద్యుడు—సన్నిపాతానికి యింగ్లీషులో మందేదీ?

భద్రయ్య—పోనీ, మీ రిచ్చేమందే యింజెక్షను చేయిస్తేనో?

వైద్యుడు—అది బాగుండి. కాని సూదితో పొడవడం నాకు చేతగాదు. చేతనైనవారి నెవరినైనా తీసుకురండి.

ప్రకాశం—భద్రయ్యగారూ! మీరువెళ్లి రామనాథశాస్త్రిగారిని నోమాటు సాధనాలతో రమ్మని తీసుకురావాలండీ.

భద్రయ్య—నిమిషం. (లేస్తాడు.)

ప్రకాశం—ఆయన దొరక్కపోతే?

భద్రయ్య—వెంకన్న నాయుడుగారిని తీసుకువస్తే?

ప్రకాశం—సందేహ మేం?.........తొరగా రావాలి.

భద్రయ్య—ఇక్కడున్నట్టు రానూ? (వెడతాడు.)

వైద్యుడు—ఈలోపుగా మళ్లీ యింకోమాటు ప్రయత్నంచేద్దామా మనమూ?

ప్రకాశం—అవశ్యమూ చేద్దాం. అరగదియ్యండి.

బంగారమ్మ—నువ్వు పువ్వులరథం యెక్కావు. నేను నడిచి నిన్నందుకోగలనా బావా?

కాంతమ్మ—(కుమిలికుమిలి దుఃఖిస్తుంది.)

రత్తమ్మ—పేరన్నతప్ప మరేమీ కనపడ్డం లేదు బంగారానికి. చూశారా ప్రకాశంగారూ?

ప్రకాశం—.అవును.

కాంతమ్మ—తెలివి ఉన్నప్పుడూ అదే చూపు నాతల్లికి, యిప్పుడూ అదేచూపూ. అతను బతికివుంటే మా అమ్మ క్షణమేనా విడిచివుండలేకపోవును.

రాయడు—(తనలో) ఎంతగా తిప్పేసుకున్నాడూ పేరిగాడు తనమీదకి బంగారంమనస్సూ? బంగారం బతక్కపోవడం అంటూ వస్తే దానికి కారణం ఆరాక్షసుడే. సందేహంలేదు. వాడు బ్రహ్మరాక్షసు డవుతాడు తప్పకుండానూ. కావాలి శాస్తి.

బంగారమ్మ—నేను చిన్నపిల్లనికానూ? నాకు కాళ్లు లాగుతున్నాయి బావా? వోమాటు ఆపమనవూ బండబ్బినీ?

రత్తమ్మ—బంగారంచూపు పేరన్నమీదనుంచి మళ్లాలండీ. దానికి తగ్గసాధనం చేయించండి ప్రకాశంగారూ!

కాంతమ్మ—(ఉలిక్కిపడి ప్రకాశంకేసి చూస్తుంది.)

ప్రకాశం—బ్రహ్మదేవుడుకూడా చెయ్యలేడా పని.

రాయడు—విషమించకుండా యీ మందు పడవలసింది. మనం ఆరాక్షసముండాకొడుకు జోగారావుని నమ్ముకొని వొకపూటల్లా చెడ్డాం.

బంగారమ్మ—వుండవూ? వుండవూ? నేను పరిగెత్తలేను బావా? వొక్కమాటు ఆపమను బావా! పోనీ, నింపాదిగా నడిపించమను, యెగిరి రథమీ్మద పడతాను నేను.

ప్రకాశం—యేమి తదేకదృష్టండీ? పతివ్రత అంటే యింతకంటే యెవరు వైద్యమహాశయా?

వైద్యుడు—ఇలాంటి పతివ్రత లుండబట్టే ప్రపంచకం యింకా నిలిచివుంది.

రత్తమ్మ—(తనలో) పెళ్లికాందే పతివ్రత అంటారేమిటమ్మా వీళ్లూ?

రాయడు—(తనలో)వొక్కొక్కప్పుడు ప్రకాశంగాణ్ని చూస్తే వొళ్లు మండిపోతుంది. ఈయింటికి శనిగాడులాగ దాపరించాడు వీడు. పతివ్రతట. వీడి శ్రాద్ధంకాదూ?

బంగారమ్మ—నుంచోవూ?నుంచోవూ? అయితే నువ్వుచేయించిన నగలు నాకక్కరలేదు. ఇదిగో నువ్వు పుచ్చేసుకో. అంతేమరి. లేకపోతే నుంచోకపోవడమేం?

కాంతమ్మ—అతను యెదురుగుండా వున్నట్టు మాట్లాడుతోంది. అలా కనపడుతున్నాడుకాబోలు నాతల్లికి? ఏమండన్నయ్యగారూ?

ప్రకాశం—కనపడ్డమేకాదు, ఇక్కడే వుంటారు పేరుభట్టుగారు. ఆయనమాత్రం బంగారాన్ని విడిచిపెట్టివుండగలర్గా?

కాంతమ్మ—యెలాంటి వాళ్లని విడతీశాడండీ దేవుడూ?

రత్తమ్మ—నువ్వు అలా అనకు మరదలా! కాస్త నింపాదిగా వుండీదాకా దాని బుద్ధి మళ్లించాలి మనం.

కాంతమ్మ—మనమాట దానికి తెలిస్తేనా?

ప్రకాశం—ఇంకా కాలేదూ అరగదియ్యడం?

వైద్యుడు—కావచ్చింది. ఇది నవరత్న చింతామణండీ. పెద్దాపురంసంస్థానంలో బుచ్చిసీతమ్మాదేవిగారి హైములో లక్షాయాభై వేలరూపాయలు ఖర్చుపెట్టి తయారుచేయించిం దిది. వొక్క అరతులం సంపాదించారు మాముత్తాతగారు. ఇంకా పదితరాలదాకా వుంటుంది. చేతులు నొప్పి పట్టాలిగాని అరగడమే? యెన్ని తిప్పులు తిప్పుతున్నానో చూస్తున్నారు కాదూ? మీమాట తీసెయ్యలేక బేరంచెయ్యలేదు; గాని తిప్పుకి రూపాయికి తక్కువపుచ్చుకోను నేనెక్కడానూ?

రత్తమ్మ—మా బంగారాన్ని మాకిస్తిరా తిప్పుకి రూపాయికాదు రెండు పుచ్చుకున్నా యిబ్బందిలేదు. ఇలాంటప్పుడు డబ్బుకి మొగం చూసుకుంటామా మేమూ? ఏమండీ ప్రకాశంగారూ?

ప్రకాశం—సందేహమేం? (వైద్యుడుకేసితిరిగి) బంగారాన్ని బతికిస్తే మీరు కోరినంతా కాంతమ్మగారు యివ్వడమేకాదు, రత్తమ్మగారు సొంతంగాకూడా బహుమతీ చేస్తారు మీకు. ఆవిడ మూడోమేనత్త. ప్రాణాలన్నీ బంగారమ్మమీద పెట్టుకొనివున్నారావిడ.

రాయడు—(తనలో) నాచేతినున్న రిస్టువాచీ యిచ్చేస్తాను నేను. నెల్లాళ్లయింది లాటరీలో వచ్చి నాకిది.

బంగారమ్మ—ఎవర్రా మీరూ? వెధవల్లారా మీదకి వస్తారేం? నేను బ్రాహ్మణపిల్లని, కనపడమూ? పోతారా, పోరా అలాగ? ముట్టుకుంటారా యేమిటర్రా?

కాంతమ్మ—(నెత్తిబాదుకుంటూ) అయ్యో, యములాళ్లు కనబడుతున్నారు నాతల్లికి. రామా, రామా!

ప్రకాశం—అక్కయ్యగారూ! మీరుకూడానా! ఇంక మేమేంచెయ్యగలమూ?

వైద్యుడు—అయింది. రండి శాస్త్రిలుగారూ!

ప్రకాశం—(అనామికతో మందు తీసుకొని) "ఔషధం జాహ్నవీతోయం వైద్యో నారాయణో హరిః" (అంటూ మంచందగ్గిరికి వెడతాడు.)

బంగారమ్మ—(గభీమని లేచి కూచుని కౌగిలింమకోపోయేటట్టు చేతులూ చాపుతూ) యెంతకష్ట పెట్టావు బావా! వొళ్లో కూచోనియ్యి. (ప్రక్కకి వాలుతుంది.)

ప్రకాశం—పట్టుకోండి, పట్టుకోండి, రత్తమ్మగారూ! బంగారాన్ని, పడకుండా. (తనచేతులమీద ఆపి) చూస్తారేమండీ?

(స్త్రీలూ, పురుషులూ చుట్టూ మూగుతారు. కాంతమ్మ యీసందట్లో తప్పించుకొని దొడ్లోకి వెడుతుంది. అది యెవరూ చూడరు.)

రత్తమ్మ—(బంగారమ్మని సందిట పట్టుకొని) నాకించండి నాకించండి. చూస్తారేం ప్రకాశంగారూ?

ప్రకాశం—అందరూ—నాకు సందేదీ?

బంగారమ్మ—మా అమ్మకూడా వస్తానంది; కాని వచ్చిందికాదు. ఏంచెయ్యం బావా?

(తెరలో)

"నేనూ వస్తున్నాను మాతల్లోయ్! వొక్కమాటు వుండండి మామ్మోయ్!" అని రోదనమూ, భళ్లుమని చప్పుడూ వినపడతాయి.

ప్రకాశం—అయ్యో, అయ్యో! అక్కయ్యగారు—ఎందుకు వెళ్లనిచ్చారూ ఆవిణ్ణి? చూసిరా రాయడూ!

రాయడు—ఎవరేనా యింకొకరు కూడా రండి. (వెడతాడు.)

వైద్యుడు—ఆవిడసంగతి తరవాత చూద్దాం. ఇక్కడ అంతా అయిపోయింది. యిక మందు నాకించనక్కరలేదు. కిందకి దింపండి తొరగా.

